క్లుప్తంగా

ఆవుకు ఆరు కాళ్ల దూడ జననం


తుగ్గలిలో ఆవుకు జన్మించిన ఆరు కాళ్ల దూడ

తుగ్గలి: మండల కేంద్రంలో తిరుగుతున్న ఓ ఆవు బుధవారం ఆరు కాళ్ల దూడకు జన్మనిచ్చింది. దూడ వెనుక భాగంలో అదనంగా రెండు కాళ్లు ఉన్నాయి. గ్రామస్తులు దీన్ని వింతగా చూ శారు. ఈవిషయమై పశు వైద్యాధికారిణి ప్రణీతను సంప్రదించగా జన్యులోపం వల్ల అరుదుగా ఇలాంటి దూడలు జన్మిస్తాయని తెలిపారు.

ఉపాధ్యాయుడికి సన్మానం

గోనెగండ్ల: ఇటీవల వైఎస్సార్ జిల్లాలో జరిగిన రాష్ట్రస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో గోనెగండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల జీవశాస్త్రం ఉపాధ్యాయుడు కె.విజయకుమార్ ప్రదర్శించిన సైన్స్ నూమూనా ప్రాజెక్టు రాష్ట్రస్థాయిలో ఉత్తమంగా ఎంపికైనట్లు హెచ్ఎం నాగభూషణం తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం హెచ్ఎం, ఉపాధ్యాయులు విజయకుమార్‌ను శాలువా, పూల మాలతో ఘనంగా సత్కరించారు. ఆయన మాట్లాడుతూ విజయకుమార్ సైన్స్ బోధన, అభ్యసన వ్యూహాలు అనే అంశంపై రూపొందించిన ప్రాజెక్టు ఉత్తమంగా ఎంపిక కావడంపై హర్షం వ్యక్తం చేశారు.

ప్రతి ఇంటికీ అయోధ్య అక్షింతలు

ఆస్పరి: మండలంలోని శంకరబండ గ్రామంలో బుధవారం శ్రీరామ భక్తులు పురుషోత్తమరెడ్డి, కాశీంరెడ్డి, రాఘవేంద్రరెడ్డి, గురప్ప, శేఖర్‌రెడ్డి, రామలింగడు భజన చేసుకుంటూ ప్రతి ఇంటికీ అయోధ్య అక్షింతలు, శ్రీరాముడి చిత్ర పటం అందజేశారు. ఈనెల 22వ తేదీన అయోధ్యలో శ్రీరాముని విగ్రహ ప్రతిష్ఠాపన జరుగుతున్నందున ఆరోజు ప్రతి ఇంట్లో 5 దీపాలు వెలిగించి పూజలు చేయాలని పిలుపునిచ్చారు. ఆ రోజున భక్తులకు అన్నదానం ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు.

ఒకే ఈతలో మూడు కోడెదూడలు


మూడు కోడెదూడలను ఈనిన ఆవుతో రైతు మద్దిలేటి

వెల్దుర్తి(కృష్ణగిరి): వెల్దుర్తి మండలం సర్పరాజాపురం(కొత్తూరు) గ్రామానికి చెందిన రైతు హరిజన సున్నపు మద్దిలేటికి చెందిన ఆవు మంగళవారం రాత్రి మూడు కోడెదూడలకు జన్మనిచ్చింది. అందులో ఒక కోడెదూడ చనిపోగా రెండు ఆరోగ్యంగా ఉన్నట్లు బుధవారం పరిశీలించిన వెటర్నరీ సిబ్బంది మస్తాన్ తెలిపారు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు ఆవును, కోడెదూడలను చూసి అశ్చర్యం వ్యక్తం చేశారు. ఇదే ఆవు రెండేళ్ల క్రితం మూడు కొడెదూడలకు జన్మనివ్వగా అప్పుడు కూడా ఒక దూడ చనిపోగా రెండు కోడెదూడలు ప్రస్తుతం హుషారుగా ఉన్నట్లు రైతు తెలిపారు.


ఈవీఎం పనితీరుపై అవగాహన

దేవనకొండ: జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఆదేశాల మేరకు బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ వెంకటేష్‌నాయక్ ఆధ్వర్యంలో ఈవీఎంలు పనిచేసే విధానంపై మండలంలోని అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులకు అవగాహన కల్పించారు. ఎన్నికల్లో ఈవీఎంల ద్వారా ఓటు ఎలా వేయాలనే అంశాన్ని వివరించారు. ఓటు వేసే విధానాన్ని మిషన్ ద్వారా డెమో చూపించారు. అలాగే రేపటి నుంచి వారం రోజులపాటు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేసి ఈవీఎం పనితీరు, ఓటింగ్ విధానంపై అవగాహన కల్పిస్తామన్నారు. డీటీ సుదర్శనం, ఏఎస్ఓ హరి, అన్ని రాజకీయ పార్టీ ల ప్రతినిధులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

114 రేషన్‌కార్డులు మంజూరు

మద్దికెర: మండలంలోని ఆయా గ్రామాలలో కొత్తగా 114 రేషన్‌కార్డులు మంజూరైనట్లు తహసీల్దార్ నాగభూషణం బుధవారం తెలిపారు. ఆయన బుధవారం స్థానిక కార్యాలయంలో వీఆర్వోలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రైతుల సమస్యలను పరిష్కరించాలని సూచించారు.

సావిత్రీబాయ్ పూలేకు నివాళి


నివాళులర్పిస్తున్న డీఈఓ రంగారెడ్డి

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లో బుధవారం సావిత్రీబాయ్ పూలే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్థానిక ఎంఎస్ బాలికల హైస్కూల్‌లో సావిత్రీబాయ్ పూలే విగ్రహానికి జిల్లా విద్యాశాఖ అధికారి రంగారెడ్డి పూలమాల వేసి నివాళులు అర్పించి విద్యాభివృద్ధికి ఆమె అందించిన సేవలను వివరించారు. స్థానిక పూలే అంబేడ్కర్ ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో మల్లెల అల్‌ఫ్రెడ్‌రాజు ఆధ్వర్యంలో వృద్ధులకు చీరలను పంపిణీ చేశారు.

మురిపించిన కానుక


ఎమ్మిగనూరులో పింఛన్ సొమ్ము పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మాచాని వెంకటేష్ తదితరులు


ఎమ్మిగనూరులో పింఛన్ల పంపిణీ కార్యక్రమానికి హాజరైన లబ్ధిదారులు

- ఇచ్చిన హామీని నిలబెట్టుకున్న సీఎం వైఎస్ జగన్
- అట్టహాసంగా పింఛన్ల పంపిణీ కార్యక్రమం
- రూ.3 వేల పింఛన్ అందించడంపై లబ్ధిదారుల హర్షం

ఎమ్మిగనూరుటౌన్/ఎమ్మిగనూరురూరల్: ఇచ్చిన మాట ప్రకారం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేడు వృద్ధులు, వితంతువులకు ఇచ్చే పింఛన్ సొమ్మును రూ.3 వేలకు పెంచారని ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని కుర్ణికళ్యాణ మండపంలో ఎమ్మెల్యే వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మాచాని వెంకటేష్, మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డిలతో కలిసి పింఛన్లు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పట్టణంలోనే 9,927 మందికి వివిధ పింఛన్ల ద్వారా రూ.2,99,42,000 పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. అలాగే కొత్తగా 153 మందికి పింఛన్లు మంజూరైనట్లు తెలిపారు. గత టీడీపీ హయాంలో పింఛన్ల కోసం లబ్ధిదారులు పడరాని పాట్లు పడ్డారని, ప్రస్తుతం లబ్ధిదారులందరికీ ప్రతినెలా 1వ తేదీన ఇంటి వద్దకే పింఛన్లు అందుతున్నాయని వివరించారు. సంక్షేమం, అభివృద్ధిని జోడు గుర్రాలుగా పరుగులు పెట్టిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు రానున్న ఎన్నికల్లో మద్దతు ఇవ్వా లని కోరారు. వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు బుట్టారంగయ్య, కౌన్సిలర్లు ఎంకే శివ ప్రసాద్, రాజారత్నం, సరోజ, అంపమ్మ, కేశవరెడ్డి, కామర్తి నాగేషప్ప, ఖాశీంబేగ్, సుధాకర్, రుద్రాక్షాల బజారి, రామాంజినమ్మ తదితరులు పాల్గొన్నారు.

- అలాగే స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పింఛన్ల పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఇచ్చిన మాట ప్రకారం సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పింఛను సొమ్ము పెంచి లబ్ధిదారులకు అండగా నిలిచారన్నారు. ఎంపీపీ గొల్ల కేశన్న, మండల ఉపాధ్యక్షులు గుడేకల్ పొలయ్య, ఎంపీడీఓ బంగారమ్మ, సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సీఎం వైఎస్ జగనన్నకు రుణపడి ఉంటా



వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్తగా తనను నియమించడం పట్ల సీఎం వైఎస్ జగనన్నకు, ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డికి, పార్టీ నియోజకవర్గ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటా. సీఎం వైఎస్ జగనన్న పింఛనుదారుల అభ్యున్నతిని కాంక్షిస్తూ వారికి అందించే సొమ్మును రూ.3 వేలకు పెంచారు. ప్రజల కోసం నిరంతరం తపించే నాయకుడికి రానున్న ఎన్నికల్లో అండగా నిలుద్దాం. ప్రజా సంక్షేమం అభివృద్ధి కొనసాగాలంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని రాష్ట్ర ముఖ్యమంత్రిగా మరోసారి గెలిపించుకోవాలి.

– మాచాని వెంకటేష్, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త

ఆనంద'మనీ'పింఛన్

ఆలూరు రూరల్: ఆలూరు మండలంలో పింఛన్ల పంపిణీ పండుగలా జరిగింది. పెరిగిన పింఛన్ నగదు అందుకున్న అవ్వాతాతల ముఖాల్లో ఆనందం వెల్లివిరిసింది. మండలంలో మొత్తం 6,176 పింఛనుదారులుండగా కొత్తగా 78 మందికి పింఛన్లు మంజూరైనట్లు అధికారులు వెల్లడించారు.

ఆలూరు: స్థానిక సచివాలయం–2లో ఎంపీడీఓ అల్లబకాష్ సమక్షంలో పింఛన్ల పంపిణీ చేపట్టారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు గుమ్మనూరు నారాయణస్వామి, ఎంపీపీ రంగమ్మ, జెడ్పీటీసీ సభ్యుడు ఏరూరుశేఖర్, మండల కన్వీనర్ వీరేష్, జేసీఎస్ కన్వీనర్ ఈరన్న, సింగిల్ విండో డైరెక్టర్ వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొని లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు.

ఎమ్మిగనూరుటౌన్: ప్రభుత్వం పింఛనుదారులకు రూ.3 వేల పింఛన్ అందిస్తుండడంతో లబ్ధిదారుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. పట్టణంలోని పలు వార్డుల్లో ఉదయాన్నే వలంటీర్లు లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి పింఛన్లు పంపిణీ చేశారు.

హొలగుంద: రూ.3 వేలు పింఛన్ అందించిన ఘనత సీఎం వైఎస్ జగనన్నకే సాధ్యమైందని వైఎస్సార్ సీపీ నాయకులు గుమ్మనూరు నారాయణస్వామి అన్నారు. బుధవారం హొలహర్వి ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ ఆంతోనీ అధ్యక్షతన లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలో నూతనంగా 144 మందికి పింఛన్లు మంజూరైనట్లు చెప్పారు. అభాగ్యులు, వృద్ధుల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం ప్రతినెలా 1వ తేదీన లబ్ధిదారుల ఇళ్ల వద్దకే పింఛన్ అందిస్తున్నట్లు గుర్తుచేశారు. వచ్చే ఎన్నికల్లో మరోసారి జగనన్నకు ఓటు వేసి గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. తహసీల్దార్ మల్లికార్జునస్వామి, వైఎస్సార్‌సీపీ నాయకులు భీమప్ప చౌదరి, వీరేష్, సొసైటీ చైర్మన్ శ్రీనివాసులు, జెడ్పీటీసీ లింగప్ప, సర్పంచ్ ఉలిగప్ప, ఈఓపీఆర్డీ మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.


ఎమ్మిగనూరులో వృద్ధురాలు సావిత్రమ్మకు పింఛన్ అందిస్తున్న వలంటీర్ నాగేంద్ర

జగనన్నకు రుణపడి ఉంటా



నా భర్త అనారోగ్యంతో మూడునెలల క్రితం మరణించాడు. ఆసరా కోల్పోయిన నాకు ఎవ్వరి సిఫార్సు లేకుండానే నాకు వితంతు పింఛన్ మంజూరైంది. రూ.3 వేలు అందుకున్నాను. దరఖాస్తు చేసుకున్న నెలలోపే పింఛన్ మంజూరుకావడం ఆనందంగా ఉంది. ఇంటి వద్దకే వచ్చి పింఛన్ సొమ్ము అందిస్తున్న ముఖ్యమంత్రి జగనన్నకు రుణపడి ఉంటా.

– అన్నపూర్ణమ్మ, విరుపాపురం గ్రామం

పింఛన్ సొమ్మే ఆధారం

సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం పింఛన్ సొమ్ము పెంచుతూ ఇప్పుడు రూ.మూడు వేలు చేశారు. చాలా సంతోషంగా ఉంది. పింఛన్ డబ్బుతో అవసరమైన మాత్రలు, ఇతర అవసరాలకు పనికివస్తుంది. ఆ బిడ్డ చేస్తున్న సాయం ఎప్పటికీ మరువలేను. ఒకటో తేదీ వచ్చిందంటే చాలు ఇంటికే వచ్చి పింఛను డబ్బు ఇస్తున్నారు. ఇక నాకు ఏ దిగులూ లేదు.


ఆలూరులో వృద్ధురాలు లక్ష్మీదేవికి పింఛన్ అందిస్తున్న వలంటీర్ దానాల రాజు


హొలహర్విలో లబ్ధిదారులకు పింఛన్లను పంపిణీ చేస్తున్న గుమ్మనూరు నారాయణస్వామి

6న పింఛన్ల పంపిణీ

మద్దికెర: ప్రభుత్వం అందజేస్తున్న సామాజిక పింఛన్లు వృద్ధులు, వికలాంగులు, వితంతువులకు ఈనెల 6వ తేదీన పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీఓ నరసింహమూర్తి బుధవారం తెలిపారు. మండలంలోని ఆయా గ్రామాలలో కొత్తగా 79 మందికి పింఛన్లు మంజూరయ్యాయన్నారు. ఆయా గ్రామాలలో కొత్తగా మంజూరైన వారికి అధికారులు పింఛన్లు అందిస్తారని చెప్పారు.

వైఎస్సార్‌సీపీతోనే అభివృద్ధి

- రూ.8.15 కోట్లతో మద్దికెర – మొలగవెల్లి 14 కి.మీ తారు రోడ్డు

మద్దికెర: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమవుతుందని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అన్నారు. బుధవారం మద్దికెర నుంచి ఆలూరు తాలుకా మొలగవెల్లి గ్రామానికి రూ.8.15 కోట్లతో 14 కి.మీ తారు రోడ్డు నిర్మాణ పనులకు భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మండలంలో సచివాలయాల పరిధిలో దాదాపు రూ.3.6 కోట్లతో సీసీ రోడ్లు, అభివృద్ధి పనులు చేపట్టినట్లు వివరించారు. రూ.2.25 కోట్లతో మద్దికెర– బొజ్జనాయునిపేట గ్రామానికి తారు రోడ్డు వేశామని, అలాగే జల్‌జీవన్ మిషన్ కింద ఇంటింటికి కొళాయిలు, ఓవర్‌హెడ్ ట్యాంక్‌లు నిర్మాణం చేపట్టామన్నారు. త్వరలోనే పనులు పూర్తి చేసి నీటిని సరఫరా చేస్తామన్నారు. జెడ్పీటీసీ సభ్యుడు మురళీధర్‌రెడ్డి, ఎంపీపీ అనిత, సర్పంచులు సుహాసిని, విజయుడు, మల్లికార్జున, కాంట్రాక్టర్ దశరథరామిరెడ్డి, పీఆర్ పీఐయూ డీఈ రమేష్ కుమార్‌రెడ్డి, ఏఈ జాకీర్‌హుస్సేన్, ఎంపీడీఓ నరసింహమూర్తి, తహసీల్దార్ నాగభూషణం, డీటీ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.


రోడ్డు పనులకు భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

పోలింగ్ సరళిపై అవగాహన

ఆలూరు రూరల్: పోలింగ్ సరళి, ఓటు హక్కు వినియోగంపై ప్రజలకు అవగాహన ఉండాలని ఆలూరు అసెంబ్లీ ఎన్నికల రిటర్నింగ్ అధికారి మల్లికార్జున అన్నారు. బుధవారం ఆయన స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బ్యాలెట్ యూనిట్ ఏర్పాటు చేసి ప్రజలకు ఓటు హక్కు వినియోగించుకునే విధానంపై మాక్‌పోల్ నిర్వహించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో మండలానికి ఒక బ్యాలెట్ యూనిట్ అందించామన్నారు. అన్ని మండలాల తహసీల్దార్లు వారి మండలాల్లో మాక్ పోలింగ్ నిర్వహించి ఓటర్లకు అవగాహన కల్పిస్తున్నారని చెప్పారు. అలాగే మరో బ్యాలెట్ యూనిట్‌ను ఆటోలో ఏర్పాటు చేసి ప్రతి గ్రామంలో ప్రజలు రద్దీగా ఉన్న ప్రదేశాల్లో ఓటు హక్కు ఎలా వినియోగించుకోవాలన్న దానిపై అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. అలాగే ఓటు వేసిన తర్వాత వీవీ ప్యాడ్‌లో తాను వేసిన ఓటు నిర్ధారించుకునేందుకు వచ్చే స్లిప్పుపై మాక్‌పోల్ నిర్వహిస్తున్నామని చెప్పారు. ఏఈఆర్వో రామాంజినేయులు, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ గుండాల్‌నాయక్ అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు ఉన్నారు.


ఆలూరు తహసీల్దార్ కార్యాలయంలో మాక్‌పోల్ నిర్వహిస్తున్న ఆర్వో మల్లికార్జున

టీబీ డ్యాంలో 10 టీఎంసీల నీటి నిల్వ

హొళగుంద: కర్ణాటక రాష్ట్రం హోస్పేట్ వద్ద నిర్మించిన తుంగభద్ర జలాశయంలో బుధవారం 105.788 టీఎంసీల పూర్తి సామర్థ్యానికిగాను 10.262 టీఎంసీల నిరు నిల్వ ఉన్నాయి. ఇన్‌ఫ్లో, అవుట్‌ఫ్లో జీరోగా నమోదైంది. నీటిమట్టం 1589 అడుగులకు తగ్గింది. గతేడాది ఇదే సమయానికి 73.746 టీఎంసీల నీరు నిల్వ ఉండేది. ఈ ఏడాది జలాశయంలో నీటి నిల్వ ఆశించిన స్థాయిలో లేకపోవడంతో గత నెల 25న తుంగభద్ర దిగువ కాలువ (ఎల్లెల్సీ)కు నీరు బంద్ చేసిన సంగతి తెలిసిందే. దీంతో కాలువ కింద రబీ సాగు జరగలేదు.


తుంగభద్ర జలాశయం

వ్యవసాయ మీటర్లకు బిల్లులు చెల్లించాల్సిన పనిలేదు

ఆస్పరి: బోరు, బావుల వ్యవసాయ మీటర్లకు బిల్లులు చెల్లించాల్సిన అవసరం లేదని మండల ట్రాన్స్‌కో ఏఈ మల్లికార్జున రైతులకు సూచించారు. ఆస్పరిలో బుధవారం ఆయన మాట్లాడుతూ.. మండలంలో 2853 వ్యవసా య బోర్లు ఉన్నాయన్నారు. ఇప్పటి వరకు మండలంలోని కైరుప్పల, బిల్లేకల్లు, బిణిగేరి, చిగిళి, పుప్పాలదొడ్డి గ్రామాలలో వంద మంది రైతులకు చెందిన వ్యవసాయ బోర్లుకు విద్యుత్ మీటర్లు బిగించామన్నారు. కొంత మంది రైతులు బిల్లులు చెల్లించాల్సి వస్తుందనే ఆందోళనలతో మీటర్లను తొలగించుకుంటున్నారని తెలిసిందన్నారు. రైతులు మీటర్లకు డబ్బులు చెల్లించాల్సిన అవసరం లేదని, ప్రభుత్వమే నగదు బదిలీ కింద ఒక్కో రైతుకు ప్రతి నెల రూ.5 వేల నుంచి రూ.8 వేల వరకు విద్యుత్ సంస్థకు డబ్బు చెల్లిస్తుందని చెప్పారు. రైతులు మీటర్లు తొలగించుకుంటే ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీ వర్తించదన్నారు.

మార్కెట్ ధరకే కందుల కొనుగోలు

హొలహర్వి: మండలంలోని రైతులు ఖరీఫ్‌లో పండించిన కందులను రాష్ట్ర ప్రభుత్వం బహిరంగ మార్కెట్ ధరకే కొనుగోలు చేస్తుందని ఏఓ శివశంకర్ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన మండలంలోని బేవినహాల్, సాకిబండ, హొలహర్వి, కామినహాల్, శ్రీధర్‌హాల్ గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల పరిధిలో రైతులు సాగుచేసిన కంది పంటలను ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ మండలంలో 1400 హెక్టార్లలో రైతులు కంది పంటను సాగుచేశారన్నారు. వారికి గిట్టుబాటు ధర కల్పించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. వీఏఏలు వెంట ఉన్నారు.

దేవనకొండ: మండలంలో 700 హెక్టార్లలో రైతులు కంది పంటను సాగుచేసినట్లు మండల వ్యవసాయాధికారి సురేష్ బుధవారం తెలిపారు. రైతులు పండించిన కంది దిగుబడులను బహిరంగ మార్కె ట్ ధరకే ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని చెప్పా రు. రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఉత్సాహంగా క్రీడాపోటీలు

ఆస్పరి: 'ఆడుదాం–ఆంధ్ర' కార్యక్రమంలో భాగంగా బుధవారం ఆస్పరిలో బాల్ బ్యాడ్మింటన్ పోటీలను పంచాయతీ కార్యదర్శి జంప్లానాయక్ ప్రారంభించారు. అలాగే మండలంలోని శంకరబండ, జొహరాపురం, చిన్నహోతూరు, బిల్లేకల్లు, ముత్తుకూరు, కైరుప్పల, కారుమంచి, ములుగుందం, బనవనూరు, డీకోటకొండ, చిగిళి, బిణిగేరి, నగరూరు, తంగరడోణ, యాటకల్లు, హలిగేర గ్రామాలలో బాల్ బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించారు. యువత ఉత్సాహంగా పాల్గొన్నారు.

చంద్రబాబును ప్రజలు నమ్మరు


పగిడిరాయిలో పింఛన్ లబ్ధిదారులతో కలిసి సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

తుగ్గలి: డ్వాక్రా రుణాలు, రైతు రుణాలు మాఫీ చేస్తానని చెప్పి మోసం చేసిన చంద్రబాబును మహిళలు, రైతులు ఎప్పటికీ నమ్మరని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అన్నారు. బుధవారం మండల పరిధిలోని పగిడిరాయిలో రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల నుంచి పెంచిన రూ.3 వేల పింఛన్, కొత్త పింఛన్ల పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. 600 హామీలతో నాడు అధికారంలోకి వచ్చిన చంద్రబాబు తన ఐదేళ్ల పాలనలో కనీసం ఆరు హామీలను కూడా నెరవేర్చలేదని విమర్శించారు. జగనన్న ఇచ్చిన మాట ప్రకారం రూ.3 వేలకు పింఛన్ పెంచారని, డ్వాక్రా మహిళల రుణాలు మాఫీ చేశారన్నారు. సీఎం సహకారంతో నియోజకవర్గంలో చెరువులన్నీ నీటితో నింపుతున్నామన్నారు. తుగ్గలి మండలంలో డీబీటీ, నాన్ డీబీటీ కింద మొత్తం రూ.410.33 కోట్లు ప్రజా సంక్షేమానికి ఖర్చు చేసినట్లు చెప్పారు. మండలంలో 7,836 మంది పింఛన్‌దారులకు రూ.2,33,58,500 మొత్తాన్ని ప్రభుత్వం పంపిణీ చేస్తోందన్నారు. ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చి పేదల గుండెల్లో చోటుసంపాదించుకున్న సీఎం జగనన్నను రానున్న ఎన్నికల్లో టీడీపీ, జనసేనతో పాటు ఎంతమంది కట్టగట్టుకొని వచ్చినా అడ్డుకోలేరని స్పష్టం చేశారు. అనంతరం పెరిగిన రూ.3 వేల పింఛన్, 93 కొత్త పింఛన్ల సొమ్మును లబ్ధిదారులకు పంపిణీ చేశారు. లబ్ధిదారులతో కలిసి సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం పెరాలసిస్‌తో బాధపడుతున్న మాజీ సర్పంచ్ జనార్ధనకు మంజూరైన రూ.2 లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందజేశారు. ఎంపీడీఓ సావిత్రి, నాయకులు జగన్నాథరెడ్డి, సర్పంచ్ సౌజన్య, ఎంపీపీ ఆదెమ్మ, జెడ్పీటీసీ సభ్యుడు పులికొండనాయక్, నాగేష్, బసిరెడ్డి, మోహన్‌రెడ్డి, హనుమంతు, గోపాల్‌రెడ్డి, నాగభూషణరెడ్డి, సుధాకరరెడ్డి, రంగన్న, రఘు, నాగప్ప, మధుసూధనరెడ్డి పాల్గొన్నారు.

జగనే మళ్లీ రావాలి



చెప్పిన మాట ప్రకారం ముఖ్యమంత్రి జగన్ పింఛన్ సొమ్ము రూ.3 వేలకు పెంచారు. ఆయన వచ్చాకే నాకు ఉచితంగా స్థలం ఇచ్చి ఇల్లు కట్టుకునేందుకు సాయం చేశారు. ఆయన రుణం ఎప్పటికీ తీర్చుకోలేం. పేదలకు మంచి చేస్తున్న జగనే మళ్లీ రావాలి. పేదలకు ఇంకా మేలు జరగాలి.

– మార్కికం హనుమక్క, పగిడిరాయి

పెద్ద దిక్కుగా నిలిచిన జగన్



నాకున్న కొద్దిపాటి పొలం వ్యవసాయం చేసుకుంటూ బతుకుతున్నాం. మాకు నలుగురు కూతుళ్లు. అందరికీ పెళ్లిళ్లు అయిపోయాయి. ఇప్పుడు ఇంట్లో నేను, నా భార్య మాత్రమే ఉంటున్నాం. వయసు మీద పడడంతో పొలం పనులు చేసుకోలేకపోతున్నాం. నాకు వచ్చే పింఛన్ రూ.3 వేలకు పెరిగింది. చాలా సంతోషంగా ఉంది. వృద్ధాప్యంలో మాకు జగన్ ఇచ్చే పింఛనే ఆసరా అయింది. ఆయనకు రుణపడి ఉంటాం.

– హనుమన్న, పగిడిరాయి

అర్హులందరికీ పింఛన్

నందవరం: రాష్ట్ర ప్రభుత్వం అర్హులందరికీ పింఛన్ల ను మంజూరు చేసిందని ఎంపీడీఓ దశరథ రామ య్య తెలిపారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ.. ప్రభుత్వం అర్హతే ప్రమాణికంగా లబ్ధిదారులకు రూ.3 వేలు పింఛన్ మంజూ రు చేసిందన్నారు. మండలంలో ఈ నెల 5వ తేదీన ఇబ్రహీంపురంలో ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి చేతుల మీదుగా పింఛన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించనున్నట్లు చెప్పారు. మండలంలో మొత్తం 7,208 పింఛనుదారులకు రూ.2,13,21,500 పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. అలాగే 86 మందికి కొత్త పింఛన్లు మంజూరైనట్లు వెల్లడించారు. ఈఓపీఆర్డీ ఈశ్వరయ్య, సూపరిండింటెంట్ కృష్ణమూర్తి తదిరతులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా వేలంపాట

మద్దికెర: పెరవలి గ్రామంలో ప్రసిద్ధి చెందిన శ్రీరంగనాథ స్వామి ఆలయంలో ఏడాది పాటు స్వామివారి ఫోటోలు విక్రయించేందుకు బుధవారం దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో వేలంపాట నిర్వహించగా బాల్యంరవి రూ.65 వేలకు దక్కించుకున్నారు. అలాగే భక్తులు స్వామివారికి సమర్పించిన మిశ్రమ బియ్యం పోగుచేసుకునే హక్కులను వడ్డె రంగన్న రూ.36,686లకు దక్కించుకున్నట్లు ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి, ఆలయ చైర్మన్ దస్తగిరిగౌడ్ తెలిపారు. తలనీలాల వేలంపాటకు సరైన స్పందన లేకపోవడంతో ఈ నెల 10 తేదీకి వాయిదా వేశారు.

వాటర్ ట్యాంకు నిర్మాణానికి స్థల పరిశీలన

హొలహర్వి: మండలకేంద్రంలో తాగునీటి ఓహెచ్ఎస్ఆర్ ట్యాంకు నిర్మించేందుకు బుధవారం ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ మల్లికార్జున, జెడ్పీటీసీ లింగప్ప స్థలాన్ని పరిశీలించారు. వారు మాట్లాడుతూ.. హొలహర్విలో తాగు నీటి సమస్య తలెత్తకుండా ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. త్వరలోనే వాటర్‌ట్యాంకు నిర్మాణ పనులు చేపడతామని చెప్పారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీర్ లక్ష్మన్న, మండలాధ్యక్షుడు రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అవి-ఇవి

అందరికీ ఉపాధి కల్పించండి

కృష్ణగిరి: వలసలు నిర్మూలించేందుకు కూలీలందరికీ ఉపాధి పనులు కల్పించాలని ఇన్‌చార్జ్ ఏపీఓ శేషిరెడ్డి ఆదేశించారు. స్థానిక కార్యాలయంలో బుధవారం ఆయన ఉపాధి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఉపాధి హామీ పథకంలో పనులు ఎక్కువగా గుర్తించి కూలీలకు పనులు కల్పించాలన్నారు.గ్రామాల నుంచి ఎవరూ ఇతర ప్రాంతాలకు వలస వెళ్లకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఇప్పటివరకు కొన్ని గ్రామాల్లో మాత్రమే పనులు కల్పించారని, త్వరలో అన్ని గ్రామాల్లో పనులు ప్రారంభించాలని సూచించారు. ప్రధాన రహదారులకు ఇరువైపులా నాటిన మొక్కలను సంరక్షించాలన్నారు. అన్ని గ్రామాల టీఏలు, ఎఫ్ఏలు, సీనియర్ మేటీలు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

చిప్పగిరి: ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలకు పౌష్టికాహారం తరలించే వాహనం డ్రైవర్ నేమకల్లు గ్రామానికి చెందిన తలారి శ్రీరాములు (30) అనారోగ్యంతో బుధవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న జెడ్పీటీసీ సభ్యుడు విరుపాక్షి బాధిత కుటుంబాన్ని పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలిపారు. రూ 10 వేలు ఆర్థిక సాయం అందించారు. బాధిత కుటుంబానికి అండతా ఉంటామని భరోసా ఇచ్చారు. అలాగే వైఎస్సార్‌బీమా తక్షణ సాయం రూ.10 వేలను మండల కన్వీనర్ మారయ్య అందించారు. మృతుడికి భార్య పుల్లమ్మ, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

క్రైం కార్నర్

రైలు ఢీకొని వ్యక్తి మృతి


కురువ రాముడు (ఫైల్)

వెల్దుర్తి(కృష్ణగిరి): స్థానిక రైల్వేస్టేషన్ పరిధిలోని డోన్‌వైపు రైల్వే గేట్ల సమీపంలో బుధవారం రైలు ఢీకొని వెల్దుర్తి పట్టణానికి చెందిన కురువ రాముడు (52) మృతి చెందాడు. కర్నూలు రైల్వే ఎస్ఐ శ్రీనివాసులు తెలిపిన వివరాల మేరకు.. రాముడుకు మతి స్థిమితం సరిగా లేకపోవడంతోపాటు పక్షవాతం, చెవుడు ఉన్నట్లు విచారణలో తేలిందన్నారు. సాయంత్రం 4 గంటలకు రైలు పట్టాలు దాటుతుండగా మధురై నుంచి ఓఖా (రామేశ్వరం) వెళ్లే స్పెషల్ సూపర్ ఫాస్ట్ రైలు ఢీకొట్టింది. రాముడు అక్కడికక్కడే మరణించి పట్టాలపై పడిపోగా రైలు పైలెట్ సందీప్ వెల్దుర్తి రైల్వే స్టేషన్ మాస్టర్ రామాంజనేయులుకు సమాచారం అందించాడు. స్టేషన్ మాస్టర్ ద్వారా సమాచారం అందుకున్న కర్నూలు రైల్వే పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని విచారణ చేపట్టారు. కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వెల్దుర్తి సీహెచ్‌సీకి తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు దివ్యాంగులైన సంతానం ఉన్నారు.

విద్యార్థిని ఆత్మహత్య

ఎమ్మిగనూరురూరల్: పట్టణంలోని ఎస్ఎంటీ కాలనీలో కడుపునొప్పి తాళలేక బి.గౌతమి (14) అనే విద్యార్థినీ బుధవారం ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. వివరాలు.. ఎస్ఎంటీ కాలనీలో నివాసముంటున్న మల్లికార్జున కుమార్తె గౌతమి మాచాని సోమప్ప ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతుంది. గత కొంతకాలంగా కడుపునొప్పితో బాధపడుతోంది. బుధవారం ఉదయం కడుపునొప్పి ఎక్కువ కావడంతో ఇంట్లో ఎవరు లేని సమయంలో గుడిసె ఇనుప పైపులకు చీరతో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఇంటికి వచ్చిన కుటుంబ సభ్యులు ఆమెను కిందకు దించి ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. బాధిత కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు పట్టణ ఎస్ఐ మస్తాన్‌వలి తెలిపారు.


మృతి చెందిన గౌతమి

దాడిలో గాయపడ్డ యువకుడు మృతి


మృతిచెందిన మహబూబ్ (ఫైల్)

ఎమ్మిగనూరురూరల్: పట్టణంలోని శ్రీనివాస సర్కిల్ వద్ద ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తుల దాడిలో తీవ్రంగా గాయపడిన మహబూబ్ (28) అనే యువకుడు కర్నూలు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. ఎన్టీఆర్ కాలనీకి చెందిన మహబూబ్ ఆదివారం రాత్రి నూతన సంవత్సర వేడుకలు ముగించుకొని ఇంటికి వెళ్తుండగా శ్రీనివాస సర్కిల్ దగ్గర గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన సంగతి తెలిసిందే. బాధితుడు కర్నూలు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందాడు.

దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలి

మహబూబ్ మృతికి కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని కోరుతూ బంధువులు, స్నేహితులు బుధవారం రాత్రి స్థానిక శివ సర్కిల్‌లో మృతదేహంతో ధర్నా నిర్వహించారు. రూరల్ సీఐ మోహన్‌రెడ్డి, పట్టణ ఎస్ఐ మస్తాన్‌వలి, పోలీసులు అక్కడికి చేరుకొని ఆందోళన విరమించాలని చెప్పడంతో వారు వాగ్వాదానికి దిగారు. మహబూబ్‌పై దాడి చేసిన వారిని ఇంతవరకు ఎందుకు పట్టుకోలేదని ప్రశ్నించారు. వారికి సర్దిచెప్పి మృతదేహాన్ని అంత్యక్రియలకు తరలించడంతో పరిస్థితి సద్దుమనిగింది.